## క్లుప్తంగా

### ప్రజలతో మమేకం కండి



వైఎస్ జగన్‌తో చింతలపూడి నేతలు

**చింతలపూడి:** నిత్యం ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలపై పోరాడాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన విభాగం నాయకులు తెలిపారు. పార్టీ యూత్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుల దినేష్‌రెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ ఎం దిలీప్ కుమార్ బుధవారం తాడేపల్లిలో వైఎస్ జగన్‌ను కలిశారు. కార్యకర్తలు ఎవ్వరూ భయపడవద్దని, పార్టీ అండగా ఉంటుందని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశించినట్లు చెప్పారు.

### రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రోషన్ కుమార్

**జంగారెడ్డిగూడెం రూరల్:** మండలంలోని రహదారి నిర్మాణాలకు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ బుధవారం శంకుస్థాపనలు చేశారు. రూ.3 కోట్లతో ఏలూరు రోడ్డు నుంచి చక్రదేవరపల్లి మీదుగా వేగవరం వెళ్లే రహదారి, రూ.30 లక్షలతో ఎర్రకాలువ ప్రాజెక్టుకు వెళ్లే రహదారి నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సర్పంచ్ సాయిల సత్యనారాయణ, టీడీపీ నాయకులు మండవ లక్ష్మణరావు, పెనుమర్తి రామ్‌కుమార్, రావూరి కృష్ణ, చిట్టిబొమ్మ రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### కమ్యూనిటీ హాల్ ప్రారంభం



కమ్యూనిటీ హాల్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

**కొయ్యలగూడెం:** రాజవరం పంచాయతీ గంగవరం గ్రామం దళితవాడలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బుధవారం ప్రారంభించారు. స్థలాన్ని విరాళంగా ఇచ్చిన భల్లె గంగయ్య, అప్పాయ్యమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి వంశీయులు రూ.లక్షా నలభై వేల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మించారు. దశాబ్దాల క్రితమే దళితుల నివాసానికి సుమారు ఐదెకరాల దాతలు అందజేశారని, ఇప్పుడు కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణంతో వారి ఆశయం పరిపూర్ణమైందని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, బల్లే లక్ష్మీనారాయణ, గద్దమణుగు రవికుమార్, కరాటం సాయి, బల్లే పండు, బల్లే కేసుబాబు, తోట రవి పాల్గొన్నారు.

### గిరిజన గ్రామాల్లో జ్వరాల నివారణా చర్యలు చేపట్టాలి



కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

**బుట్టాయగూడెం:** గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, జ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతూ పీవైఎల్ ఆధ్వర్యంలో బుధవారం కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ధర్నా చేశారు. ఆ సంఘ నాయకులు గురుగుంట్ల ప్రసాద్‌రెడ్డి, తగరం బాబూరావు మాట్లాడుతూ ప్రతి బుధవారం ఐటీడీఏలో గిరిజన దర్బారు నిర్వహించి పీఓ అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి వినతులు స్వీకరించాలని కోరారు. పట్టిసపాలెం సమీపంలో అసంపూర్తిగా నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేయాలన్నారు. బుట్టాయగూడెం శివారులో నిర్మిస్తున్న మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పనులు పూర్తి చేసి గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా కృషి చేయాలని అన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు ఎం.భూషణం, కట్టం నాగేశ్వరరావు, జి. లక్ష్మీనారాయణ, నడపాల ముక్కారెడ్డి, పూనెం రాము, మామిడి మురళి, గురుగుంట్ల బాబూరావు, వినోద్ పాల్గొన్నారు.

### బస్‌పాస్‌ల నిమిత్తం రూ.3 లక్షల విరాళం

**జంగారెడ్డిగూడెం:** జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో పరిధిలో సుమారు 6 వేల మంది విద్యార్థుల బస్ పాస్‌ల నిమిత్తం స్థానిక నవభారత్ పామాయిల్ కర్మాగారం యాజమాన్యం రూ.3 లక్షలు అందజేసింది. ఈ విరాళాన్ని పామాయిల్ కర్మాగారం ప్రతినిధి రాఘవరావు, ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ద్వారా ఆర్టీసీ డీఎం గంగాధరరావుకు అందజేశారు. కార్యక్రమంలో దాసరి శ్యామ్‌చంద్రశేషు, మండలి లక్ష్మణరావు, పరిమి సత్తిపండు, మేకా ఈశ్వరయ్య, రావూరి కృష్ణ, కొండేటి కిషోర్, కొప్పాక శ్రీనివాసరావు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, సాయిల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కదం తొక్కిన కార్మిక లోకం

తమ హక్కుల పరిరక్షణకై కార్మిక లోకం కదం తొక్కింది. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ ఆందోళన బాట పట్టింది. ఏళ్ల తరబడి పోరాటాలు సాగించి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాయడంపై మండిపడింది. కార్మిక వర్గాలని అణగదొక్కాలని చూస్తే సహించబోమని హెచ్చరించింది.

- లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్
- తహసీల్దార్ కార్యాలయాల వద్ద కార్మికుల ధర్నా



జంగారెడ్డిగూడెం: తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

**కుక్కునూరు:** కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయం, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ మాట్లాడుతూ కార్మిక హక్కులనేవి కార్మికుల పోరాట ఫలితంగా వచ్చాయని, ఏ ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఇవ్వలేదని అన్నారు. బీజేపీ ప్రభుత్వం నిరంతరం కార్మికులను అణిచి వేయాలని చూస్తుందని మండిపడ్డారు. కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాల్సిన ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చుతూ ఇబ్బందులకు గురి చేయడం దుర్మార్గం అన్నారు. 44 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చుతామని చేస్తున్న నిర్ణయం వలన కార్మికులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు యాజమాన్యాలకు మద్దత్తు నిచ్చే నిర్ణయాలు మానుకుని, ప్రైవేటీకరణ, జాతీయ నగదు బదిలీకరణ పథకం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రవాణా రంగం కార్మికులకు, జీసీసీ హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, స్కీమ్ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి నాగేంద్రరావు, సీఐటీయూ కోశాధికారి బాడిస సుజాత, ఉపాధ్యక్షుడు కారం రాజేశ్వరి, సభ్యులు బురం శ్రావణి, రమణ, అన్నపూర్ణ, మంగ, రాధ, భవాని, బాపనమ్మ, సౌజన్య, వెంకటలక్ష్మి, మర్తమ్మ, అంగన్‌వాడీలు, ఆశలు, యానిమేటర్లు, మధ్యాహ్న భోజన వర్కర్లు, హమాలి, వలంటీర్లు పాల్గొన్నారు.

#### లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

**ద్వారకాతిరుమల:** కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ మండల నాయకురాలు తులసి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, విశాఖ ఉక్కును పరిరక్షించాలని కోరుతూ సీఐటీయూ ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి తులసి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్ బలోపేతం కోసం నిధుల కేటాయింపులను పెంచాలని, స్కీమ్ వర్కర్‌లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గత రాష్ట్ర ప్రభుత్వం జూలైలో జీతాలు పెంచుతామని హామీ ఇచ్చిందని, దాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. ధర్నా అనంతరం డిప్యూటీ తహసీల్దార్ దుర్గామహాలక్ష్మికి వారు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అనంతలక్ష్మి, నాగలక్ష్మి, హేమలత, స్వర్ణలత తదితరులున్నారు.

#### తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

**చింతలపూడి:** దేశ వ్యాప్తంగా కార్మిక హక్కులపై జరుగుతున్న దాడులకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. మండల అధ్యక్షుడు నత్తా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ మాట్లాడుతూ లేబర్ కోడ్లను తక్షణం రద్దు చేయాలని, స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులను అరికట్టాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ,ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించడంతో పాటు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ సూర్యకుమార్, అంగన్‌వాడీ, ఆశ, మెప్మా, ఐకేపీ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

**జంగారెడ్డిగూడెం:** స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు పసల సూర్యారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు అనుకూలంగా ఉన్న చట్టాలను రద్దు చేస్తూ అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వ రంగ ఆస్తులను ప్రైవేటీకరణ చేస్తూ కార్పొరేట్లకు మేలు చేకూర్చేందుకు యత్నిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుండడం అన్యాయమన్నారు. కార్యదర్శి షేక్ సుభాషిని మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మహిళా మార్ట్‌లలో వీవోఏలను కొన్నిచోట్ల తొలగించే ప్రయత్నం చేస్తున్నారని, వెంటనే వారిని ఆదుకోవాలని వీవోలు చింతలపూడి మ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌ను కలిసి వినతిప్రతం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు బి బాలరాజు, టౌన్ అధ్యక్షుడు రేలంగి నాగరాజు, వేల్పుల రాజు, అంగన్‌వాడీ వర్కర్స్ ప్రాజెక్టు అధ్యక్షులు జి విమల, మండల అధ్యక్షులు లక్ష్మీదేవి, జి.విజయ్‌కుమారి, జి.సుబ్బాయమ్మ, వై.జగదాంబ, కార్యదర్శి ఎల్.శేషారత్నం, ఎం.రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

#### ఉద్యోగ భద్రత కల్పించాలి

**బుట్టాయగూడెం:** కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చెయ్యాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలన్నారు. అలాగే అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజనం, సమగ్ర శిక్ష, విద్య, వైద్య, 104, 108లలో పనిచేసే వారందరికీ జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని కోరారు. అనంతరం డీటీ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు పుష్ప, నూర్జహాన్, మున్ని, మంగ, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.



కుక్కునూరు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు




చింతలపూడి: సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం



బుట్టాయగూడెం: డీటీకి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు



ద్వారకాతిరుమల: డిప్యూటీ తహసీల్దార్ దుర్గామహాలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

## సమ్మె కాలంలోని జీతాలు చెల్లించాలని వినతి



ఎంఈఓ సురేష్‌బాబుకు వినతిపత్రం సమర్పిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

**కొయ్యలగూడెం:** పాఠశాల విద్య సమగ్ర శిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమ డిమాండ్లు నెరవేర్చాల్సిందిగా ఎంఈఓ సురేష్ బాబుకు వినతి పత్రం సమర్పించారు. ఎంఈఓ కార్యాలయం వద్ద బుధవారం ఉద్యోగులంతా సమావేశమై తమ డిమాండ్లను ప్రభుత్వానికి తెలిపారు. గతేడాది డిసెంబర్ 19 నుంచి జనవరి 9, 2024 వరకు 22 రోజులపాటు సమ్మె నిర్వహించామన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు తమ ప్రభుత్వం పాలనలోకి వస్తే సమ్మె కాలానికి సంబంధించి జీతభత్యాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. అదేవిధంగా ప్రస్తుతం మే, జూన్ నెలలకు సంబంధించి జీతాలను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏ సత్యనారాయణ, ఎస్ దుర్గా, యం వీరస్వామి, ఎం పుల్లారావు, ఎం జ్యోతి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి

**కుక్కునూరు:** పోలవరం నిర్వాసితుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సీపీఐ కుక్కునూరు మండల కమిటీ డిమాండ్ చేసింది. సీపీఐ మండల కార్యవర్గ సమావేశం బుధవారం జిల్లా సమితి సభ్యులు కూరాకుల బాబురావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ కాంటూరు సర్వేలతో సంబంధం లేకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకోని భూపరిహారంతో, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్‌అండ్‌ఆర్ లబ్ధిదారుల సర్వే నిర్వహించి ఏడేళ్లు పూర్తి కావస్తుందని, ఈ సమయంలో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు అనేకమంది ఉన్నారని, మరలా రీసర్వే చేసి లబ్ధిదారుల జాబితా ప్రకటించాలని కోరారు. 2006 సంవత్సరంలో భూసేకరణ చేసిన భూములకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. నిర్వాసితుల కోసం నిర్మాణం పూర్తి చేసిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు అసంపూర్తిగా, నాణ్యత లోపించి అధ్వానంగా తయారయ్యాయన్నారు. నిర్వాసితుల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణంతో సర్వస్వం కోల్పోతున్న గిరిజన, దళిత బడుగు బలహీన వర్గాలకు చెందిన నిర్వాసితులకు న్యాయమైన పునరావాస ప్యాకేజీ అందించే విషయంపై శ్రద్ధ వహించాలన్నారు. కుక్కునూరు బూర్గంపాడు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గుంతలు చెరువులను తలపిస్తున్నాయని, వెంటనే రహదారి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరిపడా మందులు ఉంచాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు అయితా సురేష్, కొన్నె లక్ష్మయ్య, మాజీ జెడ్పీటీసీ వరకా శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## నేడు స్కంద పంచమి వేడుకలు

**కొయ్యలగూడెం:** స్కంద పంచమి (కుమారషష్టి) వేడుకలు గురువారం టెంపుల్స్ సెంటర్‌లోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు అర్చకులు గుడిపూడి శేషాచార్యులు పేర్కొన్నారు. శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాల స్వామి ఆలయంలో ఉపాలయంగా నిర్మితమైన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి విశేష పూజలు ప్రారంభం అవుతాయని అన్నారు. ఈ సందర్భంగా 54 లీటర్ల ఆవుపాలతో దేవేరులతో సహా స్వామివారికి అభిషేకం, అనంతరం అన్నాభిషేక కార్యక్రమాలు, భక్తులకు ప్రసాద వితరణ నిర్వహిస్తామని తెలిపారు.

## మత మార్పిడిలను అరికట్టేందుకు కృషి



మాట్లాడుతున్న హిందూ దేవాలయాల ధర్మ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

**ద్వారకాతిరుమల:** గోదావరి జిల్లాల్లో విపరీతంగా జరుగుతున్న మత మార్పిడిలను అరికట్టి, దళిత వర్గాలను తిరిగి హిందూ ధర్మంలోకి తీసుకువచ్చే పనిలో నిమగ్నమైనట్టు హిందూ దేవాలయాల ధర్మ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దర్శనపు శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని తిమ్మాపురం దళిత కాలనీలో మంగళవారం రాత్రి హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి, సమరసత సేవా ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శ్రీరామ భజన నిర్వహించారు. ఇందులో పాల్గొన్న దళిత వర్గాల వారికి భగవద్గీతలు, స్వామివారి తీర్థ ప్రసాదాలు, పసుపు కుంకుమలను ఉచితంగా అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దర్శనపు శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మత మార్పిడుల సమాచారాన్ని, అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలను తిమ్మాపురం గ్రామానికి చెందిన ఇమాన్యుయేల్, చిలక వీరాస్వామి ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారని చెప్పారు. సమరసత సేవా ఫౌండేషన్ ఏలూరు జిల్లా పెద్దలు గోపాలకృష్ణ, సింహాద్రి భూపతి, హిందూధర్మ రక్షా సమితి నాయకులు రాజనాల రామచంద్రరావు, సుంకవల్లి రాంబాబు, సందీప్, డొక్కా బజార్, నాగు, గంజి జయరాం పాల్గొన్నారు.

## 24న వాహనాల వేలం

**జంగారెడ్డిగూడెం:** జంగారెడ్డిగూడెం ప్రాంతీయ రవాణాశాఖ పరిధిలో తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా పట్టుబడిన వాహనాలను ఈనెల 24న వేలం వేసేందుకు నిర్ణయించినట్లు ప్రాంతీయ రవాణా శాఖాధికారి మదని ఒక ప్రకటనలో తెలిపారు. 4 చక్రాల గూడ్స్ వాహనాలు 5, మ్యాక్సీక్యాబ్స్ 2, ఆటోరిక్షా 1 వేలం వేస్తామన్నారు. రూ.5 వేలు దరావత్తు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

## శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

**జంగారెడ్డిగూడెం:** ఈనెల 24 25 26 తేదీల్లో అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరగనున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతులు జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కూనపాముల విగ్నేష్, గౌరవ అధ్యక్షుడు జంపన వెంకట రమణరాజు పిలుపునిచ్చారు. బుధవారం జంగారెడ్డిగూడెం సీపీఐ కార్యాలయంలో జరిగిన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఈమేరకు కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా విగ్నేష్ మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో వస్తున్న మౌలిక మార్పుల పట్ల ఎంపిక చేసిన కార్మిక వర్గ ప్రతినిధులకు, నిష్ణాతులైన ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తారని, అనంతరం శిక్షణ పొందిన ప్రతినిధులు ఆయా జిల్లాల్లో మున్సిపల్ కార్మికులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు.

## డ్వాక్రా మహిళలు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

**లింగపాలెం:** బ్యాంకుల ద్వారా డ్వాక్రా మహిళలు తీసుకొనే రుణాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ప్రసాద్ కోరారు. బుధవారం ధర్మాజీగూడెం ఎస్‌బీఐలో డ్వాక్రా సీఏలు, డ్వాక్రా మహిళలకు బ్యాంక్‌నుంచి రుణాలు పొందడం, మరలా రుణాలు తిరిగి చెల్లించటంపై బ్యాంక్ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల వచ్చే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలి, ఇన్సూరెన్సు చేయించుకోవడం వాటి ద్వారా వచ్చే లాభాలు, ఆదాయం పెంచుకొనే మార్గాలను తెలియజేశారు. చీఫ్ మేనేజర్ క్రెడిట్ పవన్, బ్రాంచ్ మేనేజర్ రజనీ కాంత్, బ్యాంక్ సిబ్బంది, వెలుగు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ సర్వీసు క్రమబద్ధీకరించండి

**కొయ్యలగూడెం:** కొయ్యలగూడెం మీదుగా ప్రతిరోజు రాత్రి 12 గంటలకు అమలాపురం వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసును క్రమబద్ధీకరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. అమలాపురం బస్ డిపోనకు చెందిన ఎక్స్‌ప్రెస్ సర్వీస్ తెలంగాణ రాష్ట్రం భద్రాచలానికి రాకపోకలు సాగించాల్సి ఉందన్నారు. అమలాపురం నుంచి భద్రాచలం వెళ్లేటప్పుడు తణుకు, తాడేపల్లిగూడెం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, అశ్వారావుపేట మీదుగా సర్వీసు అమలు అవుతోందన్నారు. కానీ భద్రాచలం నుంచి అమలాపురం వెళ్లే బస్సు కొయ్యలగూడెం, తాడేపల్లిగూడెం, తణుకు మీదుగా అమలాపురం వెళ్లడం లేదన్నారు. కొయ్యలగూడెం నుంచి గోపాలపురం, దేవరపల్లి నేషనల్ హైవే మీదుగా రాజమండ్రి వెళ్లి అక్కడ నుంచి అమలాపురం వెళుతుందన్నారు. దీంతో ప్రతిరోజు అర్ధరాత్రి తణుకు, తాడేపల్లిగూడెం, రాజోలు చేరుకోలేకపోతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు దీనిపై శ్రద్ధ తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



రెవెన్యూ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

**పోలవరం రూరల్:** అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెవెన్యూ కార్యాలయం వద్ద సూపరింటెండెంట్ ఎస్ ప్రసాద్‌కి బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఐసీడీఎస్‌లు బలోపేతం చేయాలని, బడ్జెట్ పెంచాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పింఛన్, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఎల్ఎస్ కుమారి, సుజాత, సరస్వతీ, పద్మావతి, సత్యవేణి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

**కామవరపుకోట:** అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రాతపూర్వకంగా జూలై నెలలో జీతాలు పెంచుతామని సమ్మె కాలంలో హామీలు ఇవ్వడం జరిగిందని అన్నారు. అలాగే అంగన్‌వాడీ సమస్యలను మేము అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు వెంటనే అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పుష్పరాజ్యం, సరళ, శాంతి, అరుణ, ప్రియాంక, పద్మ, మంగతాయారు, భాగ్యలక్ష్మి, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

## వినూత్నం.. రైతులకు సన్మానం



గవరవరంలో సీనియర్ రైతులను సన్మానిస్తున్న దృశ్యం

**కొయ్యలగూడెం:** రైతులకు రిటైర్‌మెంట్ అంటూ.. వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు గవరవరం (వెంకయ్యపాలెం) గ్రామానికి చెందిన రైతులు. బుధవారం అనుభవజ్ఞులైన అన్నదాతలకు రామాలయం వద్ద సత్కార కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 70 నుంచి 90 ఏళ్ల పైబడిన 30 మంది రైతులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అతిథులుగా వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు, వర్జీనియా పొగాకు వేలం కేంద్రం నిర్వాహకురాలు గ్రేసి మార్గరెట్ పాల్గొన్నారు.

### డాగూరేకి నివాళి

**జంగారెడ్డిగూడెం:** కెమెరా సృష్టించి లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న లూయిస్ డాగూరే మహానీయుడని పలువురు ఫొటో, వీడియోగ్రాఫర్లు పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం ఫోటో, వీడియో మిక్సింగ్ యూనిట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కానుమూరి సోమరాజు ఆధ్వర్యంలో బుధవారం డాగూరే వర్ధంతి నిర్వహించారు. యూనియన్ నాయకులు సూరిబాబు, చండేశ్వరరావు, శ్రీను, రామయ్య, ప్రసాద్, సునీల్ పాల్గొన్నారు.